

టిడిపిలో విభేధాలు

మినీ మహానాడుల్లో బహిర్గతం

నాయకుల్లోనే ఒకరిపై మరొకరి ఆరోపణలు



ఇటీవల నిర్వహించిన టిడిపి మినీ మహానాడుల్లో ఆ పార్టీలోని విభేధాలు బహిర్గతం అయ్యాయి. నాయకుల్లోనే ఒకరిపై మరొకరి నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో గ్రూపులు బయటపడ్డాయి. కర్నూలు నిర్వహించిన జిల్లా మహానాడులో మాజీ మంత్రి కెఈ ప్రభాకర్ ఏకంగా మంత్రి టీజీ భరత్‌పైనే తీవ్ర ఆరోపణలు చేశారు..

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

టిడిపి మహానాడు నిర్వహించనున్న నేపథ్యంలో తొలుత నియోజకవర్గ స్థాయిల్లో మినీమహానాడులు, తరువాత జిల్లా మహానాడు నిర్వహించారు. వాటిలో టిడిపిలోనే విబేధాలు బయటపడ్డాయి. కర్నూలు జిల్లా మహానాడులో వేదికపై మాజీ మంత్రి కెఈ ప్రభాకర్ మంత్రి టీజీ భరత్‌ను టార్గెట్ చేస్తూ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలో మేయర్లు, ఛైర్మెన్‌లపై అవిశ్వాస తీర్మానం పెట్టి తొలగిస్తుంటే కర్నూలులో కనీసం పట్టించుకోచడం లేదన్నారు. పార్టీ వారిని కాదని వైసిపి నుండి వచ్చిన వారికి పదవులు ఇస్తున్నారని ఆరోపించారు. మంత్రి ఆధార్‌కార్డు చూసి తన నియోజకవర్గ ప్రజలకు మాత్రమే పనులు చేస్తున్నారని ఆరోపించారు. మేయర్ విషయంలో నెల రోజులు గడువు ఇస్తున్నామని, తరువాత ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని హెచ్చరించారు. పాణ్యం నియోజకవర్గంలో కూడా కార్పొరేటర్లు ఉన్నారని, ఆ ఎమెల్యే కూడా చొరవ చూపాలన్నారు. ఆదోనిలో ఇన్‌ఛార్జీ మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో టిడిపి మినీ మహానాడు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి టిడిపి నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ, వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్, టిడిపి సీనియర్ నాయకులు సూరం భాస్కర్ రెడ్డి గ్రూపు గైర్హాజరయింది. మినీ మహానాడులో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి, మీనాక్షి నాయుడు తనయుడు భూపాల్ చౌదరి ఆవేశపూరితంగా మాట్లాడారు. 'మీనాక్షి నాయుడు చాటున ఎదిగి నాయకులై ఆయనకే ఎదురు తిరుగుతారా' అంటూ ప్రసంగంలో పేర్కొన్నారు. చంద్రబాబు పిలుపు మేరకు చేపట్టిన కార్యక్రమానికి హాజరు కాకపోవడమేమిటని నిలదీశారు. మినీ మహానాడు నిర్వహణ గురించి తమకు సమాచారం లేదని, అలాంటిది ఎలా హాజరయ్యేదని గైర్హాజరయిన వారు చెబుతున్నారు. తమ సమస్యలు ఏవైనా ఉన్నా అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని, అక్కడే చెప్పుకుంటామని, అంతే తప్ప స్థానిక నాయకులకు చెప్పాల్సిన అవసరం లేదని వారు స్పష్టం చేస్తున్నారు.

వసూళ్లపై ఫిర్యాదు

మంత్రాలయం మినీ మహానాడును ఇటు టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి గ్రూపు పార్టీ కార్యాలయంలో చేయాలని, అటు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి గ్రూపు రివరిన్ ఫంక్షన్ హాలులో నిర్వహించాలని భావించారు. ముందుగా నియోజకవర్గ పరిశీలకులు ధర్మవరం సుబ్బారెడ్డి, ఎంపీ బస్తిపాటి నాగరాజులు పార్టీ కార్యాలయంలో తిక్కారెడ్డి గ్రూపుతో మాట్లాడారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఏడాది పాలన సందర్భంగా రెండు గ్రూపుల వారు కలిసి పోవాలని, అందరూ కలిసి కట్టుగా ఒకేచోట మినీ మహానాడు నిర్వహించి విజయ వంతం చేసుకుని మహానాడుకు సిద్ధమవుదామని కోరారు. వారి మాటలకు స్పందించిన తిక్కారెడ్డి గ్రూపు రాఘవేంద్ర రెడ్డి గ్రూపు దాడులకు పాల్పడుతోందని, ఏ విధంగా వారితో కలవాలని ప్రశ్నించారు. పైగా ప్రతి గ్రామంలోనూ ఆయన గ్రూపు కలిసి రావడం లేదని వాపోయారు. నియోజకవర్గంలో ప్రతి పనికీ ఒక ధర నిర్ణయించి వసూలు చేస్తున్నారని, ప్రతి పల్లెలో తమ గ్రూపు వారి వద్ద కూడా ప్రతి బెల్టు షాపునకు రూ.30 వేలు వసూలు చేశారని, అలా ప్రతి గ్రామంలో 6 బెల్టు షాపులు వారే నడుపుతున్నారని, ఉపాధిలో కూడా ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులకు రూ.లక్షల్లో వసూలు చేశారని ఫిర్యాదు చేశారు. మీరు చెప్పిన ప్రతి విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని పరిశీలకులు తెలిపారు. రాఘవేంద్రరెడ్డి గ్రూపుతో కలవడానికి ససే మిరా అనడంతో చివరికి తిక్కారెడ్డి మాత్రమే రాఘవేంద్ర రెడ్డి గ్రూపు ఏర్పాటు చేసిన మినీ మహానాడుకు జిల్లా అధ్యక్షుల హోదాలో హాజరయ్యారు. మిగిలిన నాయకులు తిక్కారెడ్డి గ్రూపు పార్టీ కార్యాలయం వద్దే వేచి చూసి వెనుదిరిగారు.

కూటమిలో కుంపట్లు

ఆదోని నియోజకవర్గంలో కూటమి నాయకుల మధ్య సఖ్యత కరువైందని చర్చ నడుస్తోంది. ఎమ్మెల్యేగా పార్థసారథి బాధ్యతలు చేపట్టిన మొదట్లో జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప చురుకుగా ఉండేవారు. ప్రస్తుతం ఆయన కూడా దూరంగా ఉంటున్నట్లు తెలిసింది. ఇటీవల తాగునీటి పథకాల కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన విషయంపై ఎమ్మెల్యే పార్థసారథి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆ సమావేశానికి జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప లేకపోవడం చర్చకు దారితీసింది. మధ్యాహ్న భోజనం నిర్వహణ, ఫీల్డ్ అసిస్టెంట్లు, బుక్ కీపర్లు తదితర పోస్టుల్లో తమకు అనుకూలమైన వారిని నియమించుకునేందుకు ఎవరికి వారే పావులు కదుపుతున్నారు. పార్టీల వారీగా డీలర్ షిప్‌లు పంచుకోవాలని ఇటీవల డిమాండ్ వచ్చింది. ఎమ్మెల్యే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జి మీనాక్షినాయుడు మధ్య అవగాహన కుదిరినట్లు ఆ పార్టీ నాయకులు చెప్పారు. పంపకాల కేటాయింపుల్లో జనసేన వాటా ఎంత అన్నది ఇంతవరకు స్పష్టత లేదు.

విజ్ఞానం పెంపునకు కృషి

- విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాలు
- సెస్ బకాయిలు వస్తే గ్రంథాలయాలు మరింత అభివృద్ధి
- ప్రజాశక్తితో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్



ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యార్థుల, నిరుద్యోగుల విజ్ఞానాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ తెలిపారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. దాతల సాయంతో పుస్తకాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. సెస్ బకాయిలు వస్తే గ్రంథాలయాల అభివృద్ధికి మరింత కృషి చేయనున్నట్లు తెలిపారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు...

ఉమ్మడి జిల్లాల్లో గ్రంథాలయాలు ఎన్ని ఉన్నాయి? వాటి పరిస్థితి ఏమిటి?

కార్యదర్శి : ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో గ్రంథాలయాలు 59 ఉన్నాయి. 38 సొంత భవనాలు, 12 అద్దె భవనాలు, 9 అద్దె లేని భవనాలు ఉన్నాయి. వాటిల్లో జిల్లా వ్యాప్తంగా 6,03,200 పుస్తకాలు ఉన్నాయి. అన్ని రకాల దినపత్రికలో తెప్పిస్తున్నాము. గ్రంథాలయాల్లో సభ్యత్వం 72, 663 మంది ఉన్నారు. వీటితోపాటు నిరుద్యోగులకు పోటీ పరీక్షలకు కావలసిన పుస్తకాలు కూడా ఉన్నాయి. వాటిలో ప్రముఖంగా డీఎస్సీ, గ్రూప్ 2, పోలీస్ ఉద్యోగాలకు కావలసిన పుస్తకాలు కూడా ఉన్నాయి.

గ్రంథాలయాల్లో ఉద్యోగ ఖాళీలు ఎన్ని ఉన్నాయి?

కార్యదర్శి : మొత్తం 134 పోస్టులలో 43 మంది పర్మనెంట్, 26 మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. అన్ని కేటగిరీలలో కలిపి 91 ఖాళీలు ఉన్నాయి.

గ్రంథాలయాల సెస్ ఎంత బకాయి ఉంది?

కార్యదర్శి : గ్రంథాలయ సెస్ బకాయి కర్నూల్ కార్పొరేషన్ నుంచి ఏడు కోట్ల రూపాయలు నంద్యాల జిల్లాలో రెండు కోట్ల రూపాయలు బకాయి ఉంది.

గ్రంథాలయాలకు సొంత భవనాలు ఏమైనా కట్టారా?

కార్యదర్శి : పాములపాడు, చాగలమర్రి, పగిడ్యాల, ఆర్ఎస్ రంగాపురంలో సొంత భవనాల నిర్మాణం పూర్తి అయ్యి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఆదోనిలో బిల్డింగ్ పాడుబడింది. రూ.13 లక్షలతో నిర్మించాల్సి ఉంది.

దాతల సహకారం ఏమైనా ఉందా?

కార్యదర్శి : ఈ సంవత్సరం బెంగళూరుకు చెందిన జి.సతీష్ చంద్ర, దంత వైద్యులు సునీల్ కుమార్, రచయిత జి భాగ్యమ్మ సహకారంతో రూ.30 వేలు విలువచేసే పుస్తకాలను పేద నిరుద్యోగులు చదువుకోడానికి వీలైనటువంటి పోటీ పరీక్షల పుస్తకాలను, డీఎస్సీ, జనరల్ నాలెడ్జ్, పోలీస్, రైల్వే, ఆర్‌పిఎఫ్, బ్యాంక్ కోచింగ్‌లకు సంబంది థంచిన పుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఈ పుస్తకాలను గ్రంథాలయంలో సిద్ధంగా ఉంచాము. పోటి పరీక్షలకు ప్రిపేర్ అయ్యే నిరుద్యోగులు ఇక్కడికే వచ్చి ఆ పుస్తకాలను తీసుకొని చదువుకోవచ్చు.

సేవా కార్యక్రమాలు ఏమైనా చేస్తున్నారా?

కార్యదర్శి : మా ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తూనే మాజీ గ్రంథాలయ చైర్మన్ కేజీ.గంగాధర్ రెడ్డి, ఇతర దాతల సహకారంతో కంటి, దంత వైద్య శిబిరాలు, ప్రముఖుల జయంతి, వర్ధంతులతో పాటు అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఇలాంటి సందర్భాల్లో సమాజానికి ఉత్తమ సేవ అందించిన మహిళా మణులను సత్కరించడం వంటి కార్యక్రమాలు చేస్తున్నాం.

వేసవి సెలవుల్లో గ్రంథాలయంలో ఏమైనా కార్యక్రమాలు చేస్తున్నారా?

కార్యదర్శి : వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం ఏప్రిల్ 28 నుండి జూన్ 6వ తేదీ వరకు నిర్వహిస్తున్నాం. వీటిలో గ్రంథాలయానికి వచ్చే విద్యార్థులకు చిత్రలేఖనం, నీతి కథలు, జనరల్ నాలెడ్జ్, ఇంగ్లీష్ గ్రామర్, సైన్స్, గణితంలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులు, అధ్యాపకుల చేత విద్యార్థులకు జ్ఞానాన్ని పెంపొందించే కార్యక్రమాన్ని చేస్తున్నాం. ప్రస్తుతం గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ ఇన్చార్జిగా ఉన్నారు. జిల్లాలో ఉన్న గ్రంథాలయ పన్ను (సెస్) బకాయిలపై దృష్టి సారించి వాటిని చెల్లించే విధంగా అధికారులకు ఆదేశించినట్లయితే బకాయిలు జమ అయితే గ్రంథాలయాల అభివృద్ధికి మరింత కృషి చేయగలం.



రాజ్యాంగ పరిరక్షణకు ఐక్య ఉద్యమం

- సిపిఎంను బలోపేతం చేద్దాం - సిపిఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రజా వ్యతిరేక పాలకుల నుండి రాజ్యాంగ పరిరక్షణ కోసం ఐక్య ఉద్యమాలు చేద్దామని, అందుకు అనుగుణంగా పార్టీని మరింత బలోపేతం చేసుకుందామని సిపిఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్ పిలుపునిచ్చారు. ఆదివారం కర్నూలు నగరం లోని కొత్తబస్టాండ్ వద్ద ఉన్న కార్మిక కర్షక భవన్‌లో సిపిఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఎంఏ. గఫూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర రెడ్డి, జిల్లా కార్యదర్శి డి. గౌస్ దేశాయి మాట్లాడారు. లౌకిక, ప్రజాస్వామిక, వామపక్ష ఉమ్మడి పార్టీల కృషి వలన 400 సీట్లు తెస్తామన్న బిజెపిని గతం కంటే సీట్లు తగ్గేలా చేశామన్నారు. ఒంటరిగా ప్రభుత్వం ఏర్పాటు చేయలేని స్థితిరి దిగజారేలా చేసామన్నారు. బిజెపి ప్రభుత్వం కార్పొరేట్, మతతత్త్వ అజెండాతో ముందుకు సాగుతుందన్నారు. ఉద్యోగులపై, కార్మికులపై, రైతులపై, కూలీలపై ఆర్థిక పీడనను పెంచి అప్పులయ్యేలా చేసి, కార్పొరేట్లకు రూ.లక్షల కోట్ల ఆదాయాన్ని పెంచుకునేలా చేసిందన్నారు. మహిళలపై, దళితులపై, గిరిజనులపై, మైనార్టీలపై సామాజిక దాడులు పెరిగాయన్నారు. ఈ నేపథ్యం లోనే బిజెపి ని ఒంటరి పాటు చేయడం, ఓడించడం అనే కర్తవ్యాన్ని లౌకిక, ప్రజాస్వామిక, వామపక్ష ఉమ్మడి , వ్యక్తిగత కృషి తో మరింత వేగం చేయాలన్నారు. రైతాంగ ఆత్మహత్య లు పెరగా యన్నారు. నిరుద్యోగం తీవ్రం అయిందని, కార్మిక, ఉద్యోగుల నిజ వేతనాలు పడిపోయా యన్నారు. విద్య,వైద్యం,నిత్యావసర సరుకుల ధరలు పెరిగి సామాన్యుడు జీవించడానికి కష్టమైన పరిస్థితి ఏర్పడిందన్నారు. దళిత -మహిళా -గిరిజన -మైనార్టీలపై దాడుల పెరిగిన నేపథ్యంలో వర్గ, ప్రజా, సామాజిక పోరాటాలను మరింత తీవ్ర తరం చేయాలన్నారు. సమావేశం లో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి. రామకృష్ణ, ఎండి. ఆనంద్ బాబు, టి.రాముడు, కె.వెంకటేశ్వర్లు, కెవి. నారాయణ, జిల్లా కమిటి సభ్యులు రామాంజనేయులు, ఎం.రాజశేఖర్, గురుశేఖర్, అలివేలు, లింగన్న, లక్ష్మన్న, వీరశేఖర్, గోవిందు, మోహన్, విజయ్, బాలకృష్ణ, నాగన్న, మండలాల కార్యదర్శులు ఉసేనయ్య, రాముడు, వీరన్న, కృష్ణ, తిక్కన్న, వెంకటేశ్వరరెడ్డి, శ్రీరాములు, గఫూర్‌మియా, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్

సేవా దృక్పథాన్ని పెంపొందించుకోవాలి


- డ్వామా పిడి వెంకటరమణయ్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రతి ఒక్కరూ సేవ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని డ్వామా పిడి వెంకట రమణయ్య అన్నారు. ఆదివారం కర్నూలు నగరంలోని మానవతా సేవా సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. నగర అధ్యక్షులు శోభన్ బాబు, ప్రోగ్రాం కమిటీ చైర్మన్ యుగంధర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య తో పాటు మానవతా జిల్లా కన్వీనర్ మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. మానవతా సేవా కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజలకు తీసుకెళ్లాలని కోరారు. డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ హనుమంత్ రెడ్డి , ఆత్మీయ కమిటీ చైర్మన్ ప్రభాకర్, శాంతి ర్యాలీల కమిటీ చైర్మన్ శివారెడ్డి, శేషయ్య రమణ హరీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డ్వామా పిడి వెంకటరమణయ్య



మాట్లాడుతున్న నాయకులు జి.రామకృష్ణ

27 లోగా రోడ్డు పనులను ప్రారంభించాలి

- జి.రామకష్ణ జిల్లా ప్రధాన కార్యదర్శి రైతు సంఘం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : కేతవరం నుండి గార్గేయపురం వరకు నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులను ఈనెల 27వ తేదీలోగా ప్రారంభించాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. పనులను ప్రారంభించక పోతే మంగళవారం పూడిచెర్ల మెట్ట వద్ద జాతీయ రహదారిని దిగ్బంధిస్తామని ఆయన హెచ్చరించారు. ఆదివారం ఓర్వకల్ ప్రజా సంఘాల కార్యాలయంలో ప్రజాసంఘాల సమావేశం నిర్వహించారు. ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జి.రామకృష్ణ, సిఐటియు మండల కార్యదర్శి జి శ్రీధర్, ప్రజా సంఘాల నాయకులు బి వెంకటేశ్వర్లు, టి. సూర్యనారాయణ, బి.చంద్రబాబు నాయుడు, ఎస్ మధుసూదన్, వి సుధాకర్, టి.మల్లేష్ రామకృష్ణ పాల్గొన్నారు. జి రామకృష్ణ మాట్లాడుతూ అనేకసార్లు ఆగిపోయిన రోడ్డు పనులను ప్రారంభించాలని అధికారులను కలిసి విన్నవించుకున్నా ఏమాత్రం స్పందించి పనులను ప్రారంభించడం లేదన్నారు. కేతవరం గ్రామానికి కూత వేటు దూరంలో ఆదిమానవులు సంచరించిన ప్రాంతం లిపి ఉందన్నారు. ఈ దారి గుండా అనేక గ్రామాలకు ఇటునుండి అటువైపు అటునుండి ఇటువైపు ప్రజలు వాహనదారులు ప్రయాణిస్తుంటారన్నారు. ఇప్పుడు ప్రజలు ప్రయాణించేందుకు తీవ్రమైన ఆటంకంగా రోడ్డు మారిందన్నారు. తక్షణమే రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకులు రేమట సుబ్బరాయుడు, రంగస్వామి, బుగ్గ రాముడు, సిద్దయ్య,రవి, కేతవరం గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉషూ పోటీలకు కర్నూలు విద్యార్థులు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

ఈనెల 26 నుండి 31వరకు తమిళనాడు రాష్ట్రంలో ఈ - రోడ్డులో జరిగే 25వ జాతీయస్థాయి సబ్ జూనియర్ ఉషూ పోటీలకు కర్నూలు నుండి ఎనిమిది మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో జిల్లా ఉషూ సంఘం కార్యదర్శి టి.శ్రీనివాసులు క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

పోటీలలో పాల్గొనే క్రీడాకారుల వివరాలు: టి సాయి దామిని, ఎంవిఎస్ సాయి తన్మై, షేక్ షాజిదా, ఎం.యశిత రెడ్డి, ఒ.ఉదయశ్రీ, ఎం.రిషి మహేందర్, ఎస్ఎం.సాదిక్ , టి.సాయి అరవింద్.



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన

- రూ.1500 విలువ చేసే పరీక్షలు ఉచితం
- ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ నాగేంద్ర ప్రసాద్ తోట

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు కార్డియాక్ సెంటర్ ఆధ్వర్యంలో వెంకటరమణ కాలనీ బ్రాంచ్‌లో లయన్స్ క్లబ్ సహకారంతో నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ నాగేంద్ర ప్రసాద్ తోట అన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో షుగర్ టెస్ట్, ఈసీజీ, లిపిడ్ ప్రొఫైల్, రక్త పరీక్ష ద్వారా గుండెపోటును గుర్తించే ప్రత్యేక పరీక్ష అయిన లిపో ప్రోటీన్ ఏ టెస్ట్‌ను వంటివి సుమారు రూ.1500 విలువచేసే పరీక్షలు, కన్సల్టెన్సీతో ఉచితంగా అందించామని తెలిపారు. ఈ వైద్య శిబిరానికి 200 మంది దాకా హాజరయ్యారని అన్నారు. గుండె వ్యాధిగ్రస్తులకు ఏ టెస్టులు చేయించుకోవాలనో తెలియని వారికి అవగాహన కల్పించడానికి ఉపయోగపడుతుందని అన్నారు. గుండెపోటు రెండు రకాలుగా ఉంటుందని కొంతమందికి చాతిలో నొప్పి, ఆయాసంగా ఉండడం కాళ్ల వాపులు ఉంటే వాటిని నిర్లక్ష్యం చేయకూడదని వెంటనే కార్డియాలజిస్ట్‌ను కలిస్తే ఈసీజీ, టు డిఇకో వంటి పరీక్షలు చేసి గుర్తించవచ్చునని అన్నారు. ఆంజియోగ్రామ్ వల్ల నరాల్లో ఎంత బ్లాక్స్ ఉన్నాయో కనుక్కోవడానికి ఆస్కారం ఉంటుందని తెలిపారు. దీని ద్వారా మందుల తోటే తగ్గుతుందా లేక స్టంట్ వేయాలా లేక బైపాస్ సర్జరీ చేయాలని తెలుస్తుందని తెలిపారు. షుగర్ వ్యాధిగ్రస్తులకు నొప్పి అనేది తెలియదని అలాంటివారు సైలెంట్ హార్ట్ ఎటాక్ లకు గురయ్యే అవకాశం ఉంటుందని ఇలాంటివారు ప్రతి ఆరు నెలలకోసారి ఈసీజీ పరీక్ష, సంవత్సరానికి ఒకసారి టిఎంటి, 2డి ఎకో పరీక్షలు చేయించుకోవడం ద్వారా వీటిని గుర్తించి గుండెపోటు ప్రమాదాలను నివారించవచ్చునని తెలిపారు. లయన్స్ క్లబ్ కోఆర్డినేటర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పై అవగాహన కలిగి ఉండాలని అందుకోసమే ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ వైద్య శిబిరానికి మంచి స్పందన లభించిందని ఇలాంటి ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతి నెల నిర్వహిస్తామని అన్నారు.



ఇసిజి తీస్తున్న డాక్టర్ నాగేంద్రప్రసాద్

ప్రజల కష్టార్జితం నేలపాలు

- శంకుస్థాపనలు,శిలాఫలకలు వేసి పనులు మధ్యలో నిలిపేస్తున్నారు
- పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరాభివద్ధి కోసం నగరపాలక సంస్థ పాలకవర్గం కోట్లాది రూపాయలు మంజూరు చేయడం..అధికారులు టెండర్ పిలవడం, పాలకవర్గం ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు చేయడం, శిలాఫలకాలు వేయడం పనులు ప్రారంభించి మధ్యలో వదిలేయడం వల్ల పన్నుల రూపంలో చెల్లించిన ప్రజల కష్టార్జితం కోట్ల రూపాయలు నేల పాలవుతున్నాయని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, వివిధ కాలనీల ప్రతినిధులు ఎస్.కె అస్లాం భాష, బీవి రమణ, ఏ అసరఫ్ జానీ విమర్శించారు. ఆదివారం పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం స్థానికులతో కలిసి పాత నగరంలో పర్యటించింది. వారు మాట్లాడుతూ పాత నగరంలో అధిక జనాభా ఉన్నప్పటికీ పార్కులు అందుబాటులో లేవన్నారు. పెద్ద మార్కెట్ సమీపంలో ఉన్న పార్కు అభివద్ధికి కోటి రూపాయలకు పైగా ఖర్చు చేసినప్పటికీ పూర్తి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2010లో ఒకసారి, 2022లో ఒకసారి శిలాఫలకాలు శంకుస్థాపనలు చేశారని తెలిపారు. 2022లో రూ.కోటి 17 లక్షలతో శంకుస్థాపన, శిలాఫలకం వేసి పని ప్రారంభించి మధ్యలో నిలిపేసారని తెలిపారు. ఆ నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. జరిగిన పనులన్నీ కూడా నాసిరకం గా ఉన్నాయని అన్నారు. చిన్నపిల్లల ఆడుకునేందుకు ఏర్పాటుచేసిన క్రీడా పరికరాలు కొన్ని నెలలకే శిథిలమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో అనేక చోట్ల మంజూరైన పనులు మొదలు పెట్టలేదు. కొన్ని పనులు ప్రారంభించి మధ్యలో నిలిపివేశారని ఇంత జరుగుతున్నా పాలకవర్గం పట్టించుకోకు పట్టించుకోవడంలేదని అన్నారు. పాలకవర్గం పట్టించుకోకపోవడం కాంట్రాక్టర్లు, అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం జోక్యం చేసుకొని టెండర్‌లైన అభివృద్ధి పనులను ప్రారంభించి, మధ్యలో నిలిచిపోయిన పనులన్నీ పూర్తి చేయాలని, ప్రజాధనాన్ని కాపాడాలని కోరారు. ఈ పర్యటనలో ఎస్.ఉజేర్ హహ్మద్, ఎస్. రమణ గౌడ్, ఎస్ .మబ్బుల్, నాసిర్ అహ్మద్ ఖాన్, చిత్తారు వెంకట వర్మ, ఎస్.మున్నా, ఎస్.అబ్దుల్లా పాల్గొన్నారు.



దెబ్బతిన్న పరికరాలను పరిశీలిస్తున్న నాయకులు

వక్ఫ్ సవరణ చట్ట రద్దుకు పోరాటం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ చట్ట సవరణను రద్దు చేసేంతవరకు పోరాడుతాంఅని ఆవాజ్ కమిటీ నగర అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇగ్బాల్ హుస్సేన్ ఎస్ఎండి. షరీఫ్ చెప్పారు. ఆవాజ్ కమిటీ సమావేశం ఇంతియాజ్ బాష అధ్యక్షతన హరి కిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో నిర్వహించారు. వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం 2014 నుంచి 2025 వరకు దళితుల, మైనార్టీలకు వ్యతిరేకంగా చట్టాలు తేవడంలో మునిగి తేలిందని, దళితులను మైనారిటీలను ఏ రకంగా నాశనం చేయాలని, హింసించాలి అనే కోణంలో బిజెపి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. దేశ ఆర్థిక పరిస్థితి పైన గానీ, నిరుద్యోగ సమస్య పైన గానీ పెరుగుతున్న పెట్రోల్ ,డీజిల్, గ్యాస్ ధరల పైన గాని ఏ మాత్రం కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తా మన్న మాట ఏమైందని, రూ.15 లక్షలు ఇస్తామన్న మాట ఏమైందని వారు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వక్ఫ్ చట్ట సవరణను వెనక్కి తీసుకోవాలని, లేకపోతే ప్రజలందరిని సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.



నిరసన తెలుపుతున్న జెఎసి నాయకులు

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

- మసీదుల వద్ద నిరసన - సిపిఎం సంఘీభావం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వక్ఫ్ చట్ట సవరణను రద్దు చేయాలని కర్నూలు పాతబస్తీ ప్రాంతంలో ఆదివారం అన్ని మసీదుల వద్ద ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ, షాంఘాలు ఉలేమా ఇమాముల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరిగాయి. మాసంబాష దర్గా నుండి లతీఫ్ లవ్‌బాలి దర్గా, కూఫ్ సూరత్ మసీదు, ధర్వేశ్ ఖాద్రి మసీదు వరకు ప్లకార్డులు చేత పట్టుకొని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు అబ్దుల్ దేశాయ్, చాంద్‌బాష, ఎస్ఎండి షరీఫ్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లిములపై పలురకాల ఆంక్షలు విధించిందన్నారు. దర్గాలు, మసీదులు, మదరసాలులకు వాటి పరిరక్షణకు బ్రిటిష్ కాలం నుండి ఇప్పటివరకు ముస్లిం పెద్దలు ఆస్తులను దానం చేశారని గుర్తు చేశారు. ఆ ఆస్తులు వారి అభివృద్ధి కోసం దోహదపడాలన్నారు. ఇప్పుడు వాటికి ఆధారాలు చూపాలని కేంద్ర ప్రభుత్వం కోరుతోందని, ముస్లిమేతరులను వక్ఫ్‌బోర్డు కమిటీలో సభ్యులను చేర్చాలంటున్నారని, ఇది రాజ్యాంగ విరుద్ధమని, మతసామరస్యానికి విఘాతం కలిగిస్తుందని తెలిపారు. దేశవ్యాప్తంగా నిరసన తెలిపినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ముస్లిములకు అండగా ఉంటామని ఎన్నికల ముందు చెప్పిన సిఎం చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తరువాత దీనిపై నోరు మెదపడంలేదన్నారు. వక్ఫ్‌చట్ట సవరణ చట్టం రద్దుకు కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ దర్గాల పీఠాధిపతులు, లవ్‌బాలి దర్గ పీఠాధిపతి షఫీ పాషా ఖాద్రి, సలీం, బాష, ఇలియాస్ ,ఖాద్రి అన్ని దర్గాల, మసీదుల పెద్దలు ముస్లిం సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి

- రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సిలింగ్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలో నేరనియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలలో రౌడీ షీటర్లకు, నేరచరిత్ర గలవారికి, చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు.

ఎండియు ఆపరేటర్ల ఉపాధికి ఎసరు..

ఒకటి నుంచి సేవలు బంద్ - జిల్లాలో రోడ్డున పడనున్న 818 కుటుంబాలు
నేడు కలెక్టరేట్ వద్ద ఆపరేటర్ల ధర్నా
ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఉన్నత చదువులు చదివి ఉద్యోగంలేక నాలుగు చక్రాల బండిని నమ్ముకుని బతికీడుస్తున్న ఆ బక్క జీవులపై ప్రభుత్వ నిర్ణయం శరాఘాతంగా మారింది. జూన్ ఒకటి నుంచి ఎండియు వాహనాలను నిలిపేస్తూ నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం....నోటి కాడి కూడును తొలగించింది. ఈ నేపథ్యంతో ఆ వాహనాలనే నమ్ముకుని జీవిస్తున్న వందల కుటుంబాలు రోడ్డున పడనున్నాయి. ఇటీవల సివిల్ సప్లయ్ శాఖ అనుబంధంగా సేవలందిస్తున్న ఎండియు ఆపరేటర్స్ జీవితాలే అందుకు అద్దం పడుతున్నాయి. ఈ నేపథ్యంలో వారు సోమవారం తమ సమస్యను పరిష్కరించాలంటూ పోరాటానికి సిద్ధమవుతున్నారు. ఈనేపథ్యంలో ప్రజాశక్తి ప్రత్యేక కథనం...

ప్రభుత్వ భరోసాతో ప్రజలకు సేవలందిస్తూ వచ్చారు. గత ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థకు అనుబంధంగా మొబైల్ డిస్పెన్సివ్ యూనిట్ (ఎండియు) వ్యవస్థను ప్రవేశపెట్టింది. ఈ మేరకు గతంలో ఉన్న రేషన్ డీలర్ షాపుల ద్వారా రేషన్ అందించే పద్ధతి నుంచి రేషన్ కార్డుదారులకు ఇంటి వద్దకే రేషన్‌ను చేర్చే సౌలభ్యాన్ని కల్పిస్తూ ఈ వాహనాలను ఏర్పాటు చేసింది. నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా ఈ వాహనాలను నిర్వహించేందుకు ప్రభుత్వం సబ్సిడీతో వాహనాలను కొనుగోలు చేసి వారికి ఇచ్చింది. ఈ సేవలకు గాను ప్రతిఫలంగా ప్రతి నెల వారికి రూ.21 వేలను చెల్లిస్తూ వచ్చింది. వారికి వచ్చిన ఈ సొమ్ము నుంచే వాహన నిర్వహణ ఖర్చుల కింద పెట్రోలు రూ.3000, ఇఎంఐ 3000, హెల్పర్ వేతనం రూ.5000, హమాలి చార్జి రూ.2000 పోగా సుమారు రూ.8000 వారి చేతికి అందేది. దీనితోనే వారి కుటుంబాలను గడుపుకుంటూ వచ్చారు.

శరఘాతంగా ప్రభుత్వ నిర్ణయం : టిడిపి కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎండియు ఆపరేటర్ల పట్ల, అసిస్టెంట్ల పట్ల శరఘాతంగా మారింది. ఇటీవల ఎండియు వాహనాల సేవలను జూన్ 1వ తేదీ నుంచి నిలిపివేస్తున్నట్లు జీవో నెంబర్ 5 ను విడుదల చేసింది. దీంతో ఒక్కసారిగా ఆపరేటర్ల జీవితాలు రోడ్డున పడే పరిస్థితి దాపురించింది. జిల్లాలో ఆపరేటర్లు 409 మంది, వారికి సహాయకులుగా మరో 409 మంది మొత్తం 818 మంది ఈ వాహనాలపై ఆధారపడి కుటుంబాలను నెట్టుకుంటూ వస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల కుటుంబాల జీవనస్థితి అస్తవ్యస్తంగా మారింది.

మాట మార్చిన ప్రభుత్వం: 2024లో విజయవాడ లో వరదలు సంభవించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎండియు ఆపరేటర్ల సేవలను గణనీయంగా వినియోగించుకుంది. అందులో భాగంగా వరద బాధితులకు ఐదు జిల్లాల నుంచి ఆపరేటర్లను హెల్పర్లను పిలిపించుకొని బాధితులకు వాటర్ ప్యాకెట్లు నిత్యవసర సరుకులను రవాణా చేసి పంపిణీ చేయించారు. రాత్రి పగలు తేడా లేకుండా శక్తినంత కూడగట్టి ఎండియు ఆపరేటర్లు సేవలందించారు. ఈ నేపథ్యంలో సాక్షాత్తు ముఖ్యమంత్రి ఎం డియు వాహన ఆపరేటర్ల సేవలను కొనియాడారు. ఈ వ్యవస్థను ఏదాతదంగా కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. తీరా నేడు ఆపరేటర్ల సేవలను నిలిపివేస్తూ ప్రభుత్వం మాట మార్చిందని ఆపరేటర్లు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తమకు జరిగిన అన్యాయంపై నినదించేందుకు సిద్ధమవుతున్నారు. అందులో భాగంగా సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నాకు ఆపరేటర్ల కుటుంబాలు సిద్ధమవుతున్నాయి.

తొలగించడం అన్యాయం



పేద ప్రజలకు సౌకర్యంతంగా ఉన్నాయి. వాహనాలను తొలగించడం అన్యాయం. పేదలకు సంక్షేమాన్ని దూరం చేయడమే అవుతుంది. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలి తప్ప నిర్వీర్యం చేసే పద్ధతిలో ప్రభుత్వం వ్యవహరిస్తోంది. తిరిగి వెంటనే ఎండియు వ్యవస్థను కొనసాగించాలి.
- ప్రభాకర్, ఏపీ ఆటో అండ్ ట్రాలీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి

కరోనాలో సైతం సేవలందించాం



కరోనా వంటి భయంకరమైన పరిస్థితుల్లో సైతం ఇంటింటికి తిరిగి నిత్యావసర సరుకులను ప్రజ లకు పంపిణీ చేశాం. ప్రమాదం అని తెలిసినా ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించాం. **-ఎస్ఎండి రఫీక్, ఎండియు ఆపరేటర్ యూనియన్ కోశాధికారి.**

మా జీవితాలతో చెలగాటం



ఎండియు వాహనాల సేవలను నిలి పేయడం దుర్మార్గం. దాన్ని నమ్ము కుని జీవిస్తున్న కుటుంబాలు రోడ్డున పడ తాయి. ఇది ఆపరేటర్ల కుటుంబాల జీవితాలతో చెలగాటం ఆడడమే అవుతుంది. **-కేశవయ్య, ఆపరేటర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు**

చంద్రబాబుకుట్రతో ఎండియు వాహనాలు రద్దు

మాజీ ఎంపీ బుట్టా రేణుక

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

రేషన్ డోర్ డెలివరీ రద్దు చేసి చంద్రబాబు ప్రభుత్వ తిరోగమన పాలనకు, ఎండియు వ్యవస్థపై కుట్రలకు నిదర్శనమని మాజీ ఎంపీ బుట్టా రేణుక పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో మే 25న నియోజకవర్గానికి చెందిన అనేకమంది ఎండియు ఆపరేటర్లు వైసిపి ఇంచార్జ్, మాజీ ఎంపీ బుట్టా రేణుకను కలిశారు. వారి వారి సమస్యలు, రేషన్ బియ్యాన్ని ఇంటి వద్దకు చేర్చే విధంగా గత ప్రభుత్వంలో విజయవంతంగా అమలైన డోర్ డెలివరీ విధానాన్ని అప్రతిష్ట కలిగించే విధంగా రద్దు చేయడాన్ని బుట్టారేణుక తప్పుపట్టారు. ఆమె మీడియతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ప్రజలకు దగ్గరైన పాలనకు నాందీ పలికిందన్నారు. ఆ సంకేతంగా అందరికీ నాణ్యమైన బియ్యాన్ని గడపదాకా చేర్చే విధానాన్ని ఎండియు వ్యవస్థ ద్వారా ప్రవేశపెట్టిందన్నారు. ఇది దేశంలోనే ఏ రాష్ట్రం చేయని సాహసమని, ఈ విధానాన్ని 8 రాష్ట్రాలు అధ్యయనం చేశాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రశంసించిందని, టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రద్దుచేయడం సరికాదన్నారు. ఈ విధానం ద్వారా లబ్ధిపొందిన లక్షలాది కుటుంబాలు ఇప్పుడు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటాయన్నారు. రాష్ట్రంలోని 1.45 కోట్ల రేషన్ కార్డుదారుల్లో ఎక్కువ మంది రోజువారీ కూలీలు, చిన్నతరహా వ్యాపారులు. ఒక్క రోజుకు వారికి లభించే ఆదాయం సగటున రూ. 500గా లెక్కిస్తే, రేషన్ కోసం దూరం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఈనిర్ణయంతో లక్షలాది ఎండియు వాహనదారులు ఉద్యోగుల భవిష్యత్తును శూన్యంలోకి నెట్టిందన్నారు. పేదల జీవితాలతో ఆడుకునే విధంగా ఈ నిర్ణయం తీసుకున్న కూటమి ప్రభుత్వాన్ని చరిత్ర ఎప్పటికి క్షమించదని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది డ్రైవర్లు, హెల్పర్లు, సాంకేతిక సిబ్బంది ఈ డోర్ డెలివరీ ద్వారా ఉపాధి పొందుతున్నారని, వాళ్ల జీవనాధారం ఒక్కసారిగా నిలిచిపోయిందన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎండియు సేవలు పునరుద్ధరించాలని కోరారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎండియు వాహన దారులు , వైసిపి నాయకులతో మాజీ ఎంపి బుట్టారేణుక

65 ఏళ్లు పైబడిన వారికి రేషన్ డోర్ డెలివరీ చేయాలి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

చౌక ధరల దుకాణాల ద్వారా వచ్చే నెల ఒకటో తేదీ నుండి నిత్యవసర సరుకుల పంపిణీ ప్రక్రియ మొదలైన తరువాత 65 ఏళ్ళు పైబడిన వారికి విభిన్న ప్రతిభావంతులకు హోమ్ డెలివరీ చేయాలనిఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే రేషన్ సరుకులు చౌక ధర దుకాణాలలోనే పంపిణీ పకడ్బందిగా జరిగేలా అధికారులు చర్యలు చేపడతారన్నారు . బియ్యం కార్డు కలిగిన 65 ఏళ్ళ పైబడిన వారిని, విభిన్న ప్రతిభావంతుల వివరాలు సేకరించి రేషన్ సరుకులు హోమ్ డెలివరీ జరిగేలా డీలర్లు బాధ్యత తీసుకోవాలన్నారు. చౌక దుకాణాలు ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుండి రాత్రి 8 వరకు తెరిచి ఉంటాయన్నారు. ప్రభుత్వ నిబంధనలు తప్పక డీలర్లు పాటించాలన్నారు. క్షేత్ర స్థాయిలో అధికారులు తనిఖీలు చేస్తారన్నారు. కార్డు దారులు సక్రమంగా సరకులు పొందాలని ఇబ్బంది ఏర్పడితే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆదోని ఎమ్మెల్యేను నిలదీసిన మహిళలు

రావడం వెళ్లడం కాదు - దండం పెడతాం మరుగుదొడ్లు నిర్మించండి
ప్రజాశక్తి-ఆదోని

ప్రభుత్వాలు మారిన తమ జీవితాలు మాత్రం ఇలానే ఉన్నాయని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు అధికారులు కాలనీలో పర్యటించినప్పుడు మాత్రమే కాలువలు సిమెంట్ రోడ్లు మరుగుదొడ్లు నిర్మిస్తామని చెబుతూనే తప్పించుకుంటున్నారని అసహనం వ్యక్తం చేశారు. కాలనీ ఏర్పడి రెండు దశాబ్దాలయింది. కనీస సదుపాయాలు లేక ఉక్కిరిబిక్కిరవుతున్నం... దుర్భరమైన పరిస్థితుల్లో ఉన్నాం... పట్టణ శివారులోని అమరావతినగర్‌లోని న్యూ అమరావతి కాలనీవాసులు వాపోతున్నారు. ఎన్నికల సమయంలో మాత్రం ఫోటోలకు ఫోజులిస్తూ మరుగుదొడ్లు నిర్మిస్తాం. అని చెప్పి ఇంతవరకు ఒక్క పని తమ కాలనీలో చేయలేదని మహిళలు ఆవేదనను వెల్లగక్కారు.

ఆదివారం అమరావతి నగర్‌లో ఆవార్డు కౌన్సిలర్ లలితమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పార్థసారథి హాజరయ్యారు. సభలు, సమావేశాలు కాదని తమ సమస్యలు తెలుసుకునేందుకు తమ ఇళ్ల వద్దకు రావాలని ఎమ్మెల్యేను మహిళలు చుట్టుముట్టారు. స్నానం చేసిన, బట్టలు ఉతికిన నీళ్లు ఇళ్ల మధ్యలో చేరడం వల్ల ఒకరికొకరు ఘర్షణలకు పాల్పడుతూ మనస్థాపాల గురవుతున్నామని మహిళలు ఆయన దృష్టికి తెచ్చారు. ఇంటి ఆవరణలోనే గుంత తవ్వి నీళ్లను నిల్వ ఉంచుకుంటున్నామని వివరించారు. రోడ్లు డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలన్నారు. లక్షలాది రూపాయలు మంజూరు అయ్యాయని చెబుతున్నారని, పనులు ఎక్కడ జరగాయో చెప్పాలని మహిళలు నిలదీశారు. నల్లరేగడి భూమి కావడం వల్ల చిన్నపాటి వర్షం వచ్చినా నేలతడిచి బురద మయంగా మారడం వల్ల కాలు అడుగు తీసి వేయని పరిస్థితి ఉందన్నారు. మరుగుదొడ్లు లేక పోవడం వల్ల పొదలు చాటున ఆరుబయటనే అవసరాలు తీర్చుకుంటున్నామని తమ కష్టాలు ఎవరికి రాకూడదంటూ కన్నీరు మున్నీరయ్యారు. దశలవారీగా రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం చేయిస్తానని ఎమ్మెల్యే పార్థసారథి మహిళలకు నచ్చచెప్పారు. మరుగుదొడ్లు అవసరం ఉన్న వారందరూ సచివాలయంలో అర్జీలు ఇవ్వాలని, ప్రభుత్వం ద్వారా నిర్మాణం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. హామీ ఇచ్చి వెళ్లడం కాదని ఎంతలోగా పనులు చేయిస్తారో చెప్పాలంటూ మహిళలు ఎమ్మెల్యేలు పట్టు పట్టారు. వారం పది రోజుల్లో గా పనులు మొదలయ్యేలా చూస్తామని, మరుగుదొడ్లకు డబ్బులు ఇప్పిస్తామన్నారు. సొంతంగా మరుగుదొడ్లు నిర్మించుకోవాలని మహిళలకు సలహా ఇచ్చారు. కౌన్సిలర్‌గా గెలిచినా ఒక్క అభివృద్ధి పని జరగకుండా ఎర్రి స్వామినే వ్యక్తి అడ్డుపడ్డారని కౌన్సిలర్ భర్త మధుసూదన్ శర్మ సభలోనే కన్నీరు పెట్టుకున్నారు. కౌన్సిలర్‌గా గెలిచిన వారం తిరగకముందే వార్డులోకి రావద్దంటూ హుకుం జారీ చేసి భయాందోళన గురి చేశారని కాలనీవాసులకు వివరించారు. ప్రజలకు అవసరమైన పనులు కచ్చితంగా జరిగేలా శ్రద్ధ తీసుకుంటామని కౌన్సిలర్ లలితమ్మ హామీ ఇచ్చారు కార్యక్రమంలో స్థానికులు ఉన్నారు.



మా సమస్యను పరిష్కరించండి ఎమ్మెల్యేరార్థసారధిని వేడుకుటుంటున్న మహిళ

ఆశాజనకంగా ముంగారు వర్షాలు

అందని సబ్సిడీ విత్తనాలు
ప్రజాశక్తి -హొళగుంద

ఆశ జనకంగా ముంగార వర్షాలు కురుస్తున్నాయి. ఏడాది మే 15 నుండి 20 వరకు కుండపోత వర్షాలు కురిసి చెరువులు. కుంటలు నిండిపోయాయి. రైతులు ఎర్ర నేలలు ప్రతి పంట విత్తనాలు విత్తడంలో నిమగ్నమయ్యారు. మంచి వర్షాలు కురుస్తుండటంతో మహిళలకు కూడా పనులు దొరుకుతున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ముందుగానే రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకి మన జిల్లాలో కూడా ఎడతెరిపి లేకుండా వర్షాలు పడడం ఆనందంగా ఉందని రైతుల పేర్కొంటున్నారు. గత 15 ఏళ్లుగా తొలిసారిగా మే 15 నాటికే వర్షం కురవడం ఇదే మొదటి సారి అని అన్నారు. 2009లో ఇలాంటి వర్షాలు కురవడంతో మంచి పంటలు చేతికి వచ్చాయని రైతులు చర్చించుకుంటున్నారు.

సబ్సిడీ విత్తనాలు అందించాలి: వ్యవసాయ అధికారులు మంచి పదును సమయంలో రైతులకు సబ్సిడీ రూపంలో విత్తనాలు అందించ లేకపోతున్నారని తమకు అవసరం లేని విత్తనాలను అందుబాటులో పెట్టారని రైతులు అంటున్నారు. జీలుగ, పిల్ల పెసర విత్తనాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇవి పెద్దగా అవసరం లేదని రైతుల పేర్కొంటున్నారు. కందులు, వేరుశనగ, కొర్రలు, ప్రత్తి విత్తనాలు తదితర విత్తనాల అవసరం ఉన్నట్లు తెలిపారు. వ్యవసాయ అధికారులు మాత్రం ఇండెంట్ పెట్టాం సబ్సిడీ విత్తనాలు వచ్చిన వెంటనే జూన్ నెల మొదటి వారంలో అందించడానికి కృషి చేస్తామని పేర్కొంటున్నారు. ఇలా అయితే రైతులు బయట మార్కెట్లో అధిక ధరలకు విత్తనాలను కొని నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు స్పందించి వెంటనే సబ్సిడీ విత్తనాలు అందించి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విద్యతోనే అభివృద్ధి

- వాల్మీకి బోయ ఉద్యోగుల సంఘం
ప్రజాశక్తి- ఎమ్మిగనూరు

వాల్మీకి బోయల అభివృద్ధి విద్యనభ్యసించడం ద్వారా సాధ్యమని వాల్మీకి బోయ ఉద్యోగుల సంఘం నాయకులు బాల వెంకటేశ్వర్లు,డాక్టర్ మల్లన్న, వెంకట రాఘవన్, మాధవి, నాగమణి పేర్కొన్నారు. ఆదివారం ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రధాన పోస్ట్ఆఫీసుకు ఎదురుగా ఉన్న వాల్మీకి బోయ సంక్షేమ భవన్ ఆవరణలో వాల్మీకి బోయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 2024-2025 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షా ఫలితాలలో వివిధ మండలాల స్థాయిలోనూ , జిల్లా స్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన వాల్మీకి బోయ విద్యార్థిని, విద్యార్థులకు మహర్షి వాల్మీకి ప్రతిభ పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులైన ఉసేని అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. నాయకులు మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుర్తించి ఈ రకమైన కార్యక్రమాలను నిర్వహించి వారినీ ప్రోత్సహించడం వల్ల భవిష్యత్తులో ఈ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి అవకాశం ఉందని తెలిపారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బోయ కావ్యకు రూ.10,000 వేలు, జ్ఞాపకను, రెండోస్థానంలో నిలిచి సమాన మార్కులు తెచ్చుకున్న బోయ వరుణ్ సందీప్ కు కౌశిక్ కుమార్‌లకు రూ.6000 వేలు, జ్ఞాపికను,మూడో స్థానంలో నిలిచిన బోయ కౌశిక్ నాయుడుకు రూ.4000 వేలు, ఒక జ్ఞాపకను మధుబాబు నాయుడు, సత్యన్న, ఎఱమల్లయ్యలు అందజేశారు. జిల్లాలోని వివిధ మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి నగదు, జ్ఞాపికలు అందజేశారు. ఉద్యోగుల సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి నగదు, జ్ఞాపికను అందజేస్తున్న నాయకులు

ఎస్‌జిటిలనే హెచ్ఎంలుగా నియమించాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి - ఆదోని: ప్రాథమిక ఆదర్శ పాఠశాలల హెచ్ఎంలుగా సీనియర్ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులనే నియమించాలని ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షులు సి.నాగరాజు, రాష్ట్ర పురపాలక కన్వీనర్ జి.వీరచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. ఆదోని ఎస్టీయూ భవన్‌లో పట్టణ అధ్యక్షుడు కె.రవి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో హేతు బద్ధీకరణలో మిగిలిపోతున్న స్కూల్ అసిస్టెంట్లను ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలను నియమించే ప్రక్రియ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, దీని వల్ల సీనియర్ ఎస్‌జిటి లకు అన్యాయం జరుగుతుందన్నారు. ఉన్నత పాఠశాలల్లో పనిచేసే టీచర్లను ఉన్నత పాఠశాలలకే పరిమితం చేయాలని తిరిగి ప్రాథమిక విద్య వ్యవస్థలోకి తీసుకురావడం విడ్డూరంగా ఉందని అభ్యంతరం తెలిపారు. పట్టణ ప్రధాన కార్యదర్శి భీమరాజు, ఎస్టీయూ నాయకులు జంబులయ్య, రాజా సతీష్ ఉన్నారు.



రేషన్ బియ్యం స్వాధీనం లారీ సీజ్

ప్రజాశక్తి - గోనెగండ్ల

అక్రమంగా లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆదివారం ఉదయం విజిలెన్స్ అధికారులు గోనెగండ్లలో పట్టుకున్నారు. ఆదోని నుంచి కర్నూలుకు లారీలో అక్రమంగా తరలిస్తున్న 245 బస్తాల బియ్యాన్ని విజిలెన్స్ డిటి మహేష్, ఎస్ఐ నరేంద్రబృందం గోనెగండ్ల వద్ద కాపు కాచి పట్టుకున్నారు. లారీని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించడంతో పాటు నిందితుడు రాము యాదవ్ పై కేసు నమోదు చేసినట్లు సిఐ విజయభాస్కర్ తెలిపారు.

శ్రీ మఠంలో ఘనంగా స్వర్ణ పల్లకోత్సవం

ప్రజాశక్తి-మంత్రాలయం : ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో రాఘవేంద్రుని స్వర్ణ పల్లకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాఘవేంద్రస్వామి దర్శనార్థమై శ్రీ మఠం చేరుకున్న భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. స్వర్ణ పల్లకి సేవ చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించారు. బృందావన ప్రతిమను స్వర్ణ పల్లకిలో ఉంచి మేళ తాళాలు మంగళ వాయిద్యాల నడుమ ఘనంగా పల్లకోత్సవం నిర్వహించారు. సహాయక పిఆర్ఒ హోన్నొళ్ళి వ్యాసరాజాచార్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రాలయంలో యాత్రికుల సందడి

ప్రజాశక్తి-మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామి సన్నిధిలో భక్తుల కోలాహలం నెలకొంది. ఆదివారం రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశంలో ఉన్న వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొనేందుకు బారులు తీరారు. స్వామి వారికి ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చారు. పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు భక్తులకు ఫలమంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు.

రియల్ ఎస్టేట్ రంగ ఆశాకిరణం క్రెడాయ్

ఘనంగా ముగిసిన క్రెడాయ్ ప్రాపర్టీ ప్రదర్శన
ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

మూడు రోజులుగా కర్నూలు ఎస్‌టిబిసి మైదానంలో అత్యంత వైభవంగా జరిగిన క్రెడాయ్ ప్రాపర్టీ ప్రదర్శన ఆదివారం విజయవంతంగా ముగిసింది. ఆస్తి కొనుగోలుదారులకు ఒకే వేదికపై సమగ్ర పరిష్కారాలను అందించడమే ఈ ప్రదర్శన ముఖ్య ఉద్దేశ్యం. ముఖ్య అతిథి కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్ర బాబు మాట్లాడుతూ క్రెడాయ్ చేపట్టిన ఈ ప్రదర్శన రియల్ ఎస్టేట్ రంగ అభివద్ధికి ఎంతో దోహదపడుతుందని కొనియాడారు. ఆస్తి కొనుగోలు చేయాలనుకునే వారికి అవసరమైన అన్ని సదుపాయాలను ఒకచోట ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కర్నూలు జిల్లా పరిసర ప్రాంతాల అభివృద్ధికి తోడ్పడే ఇటువంటి ప్రదర్శనలకు ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన లక్కీ డిప్ విజేతలకు రవీంద్ర బాబు బంగారు నాణేలు, ఇతర విలువైన బహుమతులు అందజేశారు.

క్రెడాయ్ అధ్యక్షులవారి హర్షం: భారీ వ్యాపార లావాదేవీల ప్రదర్శన ముగింపు సందర్భంగా క్రెడాయ్ సంస్థ అధ్యక్షుడు సురేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, తమ క్రెడాయ్ ప్రాపర్టీ ప్రదర్శనకు విశేష స్పందన లభించడం, గణనీయమైన వ్యాపార లావాదేవీలు జరగడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరి 'ఇంటి కలను' సాకారం చేసే దిశగా క్రెడాయ్ నిరంతరం కషి చేస్తుందన్నారు. క్రెడాయ్ సంస్థ కన్వీనర్ ఎం. శ్రీనివాస రావు మాట్లాడుతూ ప్రదర్శనకు అనూహ్యమైన ఆదరణ లభించిందన్నారు. 'అందరూ ఆస్తిపరులు కావాలనే' తమ లక్ష్యానికి ఇది ప్రత్యక్ష నిదర్శనమని అన్నారు. సందర్శకులు ప్రదర్శన నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారని, రియల్ ఎస్టేట్ రంగం పట్ల తమకున్న సందేహాలకు వివిధ స్టాల్స్‌లోని సిబ్బంది స్పష్టమైన సమాధానాలు ఇచ్చారని తెలిపారు. మూడు రోజుల పాటు ఒక వేడుకలా ప్రదర్శన కొనసాగడానికి సహకరించిన శ్రీనివాస రావు అన్నారు. క్రెడాయ్ ప్రాపర్టీ ప్రదర్శన ఏర్పాటుకు సహకరించిన, ప్రదర్శనలో పాల్గొన్న వివిధ రంగాల వారికి మూడు రోజుల పాటు విజయవంతంగా నిర్వహించడంలో చేయూతనిచ్చిన ప్రతి ఒక్కరికి తమ క్రెడాయ్ తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామని క్రెడాయ్ సంస్థ కార్యదర్శి పి. గోవర్ధన రెడ్డి అన్నారు.



జ్ఞాపికను అందజేస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

దౌల్తాపురం,నంచర్ల రోడ్డు పూర్తయ్యేనా?..

- బిల్లులు రాక ఆగిన పనులు
- కంకర మీద వెళ్లడానికి కష్టాలనేకం
- త్వరగా పూర్తి చేయాలి
ప్రజాశక్తి-చిప్పగిరి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే బీటీ రోడ్లను త్వరగా పూర్తి చేయాలని ఎంత ప్రయత్నం చేస్తున్నప్పటికీ ఆ పనులు వేగ వంతంగా పూర్తి కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత వైసిపి ప్రభుత్వం చిప్పగిరి నుంచి దౌల్తాపురం , నంచర్ల మీదుగా మద్దికేర వరకు 12 కిలోమీటర్లు బీటీ రోడ్డు పనులకు రూ.10 కోట్లతో శ్రీకారం చుట్టింది. అయితే ఆ పనులు కంకర వేసేంత వరకే పనులు సాగాయి. అక్కడి నుంచి పనులు నిలిచిపోయాయి. చిప్పగిరి, దౌల్తాపురం నంచర్ల గ్రామాల ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా చిప్పగిరికి రావాలంటే ఇరు గ్రామాల ప్రజలకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఇరు గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. నంచర్ల గ్రామానికి చెందిన ప్రజలు దౌల్తాపురం మీదుగా చిప్పగిరి చేరుకోవడానికి కేవలం 8 కిలోమీటర్లు అయితే ఈ రహదారి బాగ లేకపోవడంతో నంచర్ల గ్రామం నుంచి కసాపురం గుంతకల్లు మీదుగా చిప్పగిరికి చేరుకోవడానికి దాదాపు 30 కిలోమీటర్లు పడుతుంది. మండల కేంద్రానికి ఇంత ప్రయాసపడి వచ్చినా కొన్ని సందర్భాలలో మండల కేంద్రంలో పనులు జరగకపోవడంతో ప్రజలు తీవ్ర అసహనానికి గురవు తున్నారు. ఇప్పటివరకు దౌల్తాపురం గ్రామం దగ్గర వరకు రోడ్డు పనులు జరిగాయని, అక్కడి నుంచి నంచర్ల వరకు బీటీ రోడ్డు పనులు జరగకపోవడంతో ఈ పనులు ఎప్పుడు పూర్తయి తాయో అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. అయితే ఒకపక్క సంబంధిత కాంట్రాక్టు దారులకు పనులు చేసిన బిల్లులు రాక అవస్తులు పడుతున్నట్లు, అందుకే పనులు నిలిచి వేసినట్లు కింది స్థాయి అధికారులు తెలుపుతున్నారు. ప్రభుత్వం వారికి సకాలంలో బిల్లులు మంజూరు చేసి త్వరగా బీటీ రోడ్డు పనులు పూర్తయ్యేలా చూడాలని చిప్పగిరి, దౌల్తాపురం,నంచర్ల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



- కంకరతో వాహనాలు నడవడానికి కష్టంగా మారిన రోడ్డు

రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి
లక్ష్మన్న, దౌల్తాపురం



చిప్పగిరి నుంచి దౌల్తాపురం, నంచర్ల గ్రామాల మీదుగా మద్దికేరకు వెళ్లే బిటి రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి. మా ఇరు గ్రామాల ప్రజలు పొలాలకు వెళ్ళుటకు , చిప్పగిరికి వెళ్ళినప్పుడు ద్విచక్ర వాహనాలతో వెళ్లిన ఆ కంకర మీద వెళ్లినప్పుడు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎక్కువగా వర్షాలు వచ్చినప్పుడల్లా రాకపోకలు నిలిచిపోతున్నాయి. దయచేసి అధికారులు స్పందించి సకాలంలో బిటి రోడ్డు పనులు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆర్అండ్‌బి అధికారులను కోరుతున్నాం.



ఆదోనిలో ప్లకార్డులతో నిరసన ప్రదర్శన

వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకించాలి

ప్రజాశక్తి-ఆదోని

మసీదు, దర్గా ఆస్తులకు ఆటంకంగా మారిన వక్ఫ్ సవరణ బిల్లును ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని ఆదివారం ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ పిలుపు మేరకు ఆదోనిలో చందా సాహెబ్ మసీద్ ఎదురుగా మెయిన్ రోడ్ నుండి పోలీస్ కంట్రోల్ రూమ్ వరకు ప్లే కార్డులు ధరించి మానవహారం చేశారు. ఈ సందర్భంగా నాయకులు సౌదీ రాహుప్, షఫీ అహ్మద్, ఖాదర్, సద్దాం హుస్సేన్ మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ సవరణచట్టం 2025 కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన తెలిపినా పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. జునైద్ మాట్లాడుతూ ఎన్‌డిఎ ప్రభుత్వం తెచ్చిన ఈ కొత్త చట్టం వెనక్కి తీసుకోవాలని కోరారు. రాబోయే రోజుల్లో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్‌లా బోర్డు ఎటువంటి ప్రోగ్రామ్ పిలుపునిచ్చినా ఆదోని ప్రజలు తిప్పికొట్టాలన్నారు. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకొని ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఖతిబ్, జునైద్ ,హాస్మి కాజీ, మిషబే, నజీర్, నూర్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

కెజిబివి స్కూళ్లలో సీట్లు భర్తీ

ప్రజాశక్తి- హాలహర్వి



హాలహర్వి ఉన్న కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు ఉన్న సీట్లు భర్తీ అయ్యాయని స్పెషల్ ఆఫీసర్ పద్మావతి ఆదివారం విలేకరులతో తెలిపారు. ఇంటర్మీడియట్‌లో మొదటి సంవత్సరానికి గాను 15 సీట్లు ఖాళీగా ఉన్నాయని అన్నారు.

మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - దేవనకొండ



దేవనకొండ మండలం తెర్నేకల్ గ్రామనికి చెందిన ఉప్పర ఉమాపతి అనారోగ్యంతో గత కొన్ని రోజుల క్రితం మృతి చెందారు. మిత్రుని కుటుంబాన్ని ఆదుకోవాలని మాన వతా దృక్పథంతో 10వ తరగతి 2008 బ్యాచ్‌కు చెందిన మృతుని మిత్రులు ఆదివారం రూ.50,000 అందించారు. మృతుని పిల్లల పేరిట డిపాజిట్ చేసి బాండు ఉమాపతి భార్యకు అందజేశారు.